చాలా మెత్తన. చాలా మంచిది, చాలా మధురంగా, కర్ణపేయంగా పాడుతుంది. దాని పాటకు ముగ్ధుడై దానికి నవ మన్మథుడ్లాటి మొగుడొచ్చాడు. ఆ భర్తకి అదంటే ప్రాణం. చాలామంది ఆడవాళ్ళే వాళ్ళ దాంపత్యాన్ని చూసి నవ్వుకుంటారు. ఆ అబ్బాయిని చూసి జాలిపడతారు. కాని దాని అదృష్టం ఎవరికివస్తుంది? మాటవరసకి చెప్తాను. దానితో మాట్లాడుతున్నపుడుగానీ దాన్ని తలచుకున్నపుడుగాని దాని మంచితనం దాని పాట గుర్తుకొస్తాయి. కాని దాని రూపంకాదు, ఇంతకీ చెప్పొచ్చేదేవి టంటే రూపం వున్నవారి కందరికీ జ్ఞానం వుంటుందని హామీ ఏమీలేదు.

శరీరాలు ఎదిగి మనసులు ఎదగక మూసుకుపోయిన బాపతు జనంఆడవారిలోనేకాదు మగవారిలో కూడా హెచ్చుమందేవుండి వుంటారు.

అయితే తుగ్లక్‌లు మగవారిలోనే కాని ఆడవారిలో వుండరా అనే సంశయం నాకోటుంది. ఆడవారికి సంశయాలుండవే పిచ్చిదానా నమ్మకాలే కాని అంటాడు తుగ్లక్ మావయ్య. ఆడవారిలో లేదా మగవారిలో జ్ఞానం వృద్ధిపొంది వెర్రితలలు వేసినపుడు కాని తుగ్లకులు జన్మించరు. అంచేత జ్ఞానమే తక్కువగల ఆడ జనాభానుంచి ఆడ తుగ్లకీ మణులు జన్మించటానికిప్పటిప్పట్లో అవకాశమే లేదు.

# ఇందిరా గాంధీ, నేనూ రెండు దోసెలూ!

మొన్ననో కలొచ్చింది, నాక్కాదు మావారికి. ఇందిరా గాంధీగా రొచ్చిందిట మాయింటికి. నేనూ మా అత్తగారూ దోసెలు పోస్తున్నాం పెనం ముందు కూర్చుని. ఆవిడ మమ్మల్ని పలకరించి రెండు దోసెలుతిని వెళ్ళిపోయిందిట. సాయంత్రం ఐదూ అలా దోసెలు తినేందుకు ఆవిడ మాయింటికొచ్చి వెళ్ళేదట, సెక్యూరిటీ వాళ్ళు ఓరోజు మాయింటి మీదొచ్చి పడ్డారు. రోజూ ప్రధాని ఐదూ ఏడుగంటల మధ్య మమ్మల్ని తప్పించుకుని ఎక్కడికో వెళ్ళిపోతున్నారు. ఇక్కడి కొస్తున్నారు, దేనికి అని అడిగార్ట, దోసెలు తినడానికని మావారు తడుముకోకుండా చెప్పార్ట! వాళ్ళునమ్మలేదుట. ఇదీ కల – కథ కాదు.

మావారు మమ్మల్ని వుడికించడానికి కోస్తున్నారేమో అనుకుని "ఆపేశారేం కోతలు" అన్నా, "కోతలుకావు సరస్వత్తోడు. నాకల్లోకొచ్చిందావిడ. నువ్వే మాట్లాడావు కూడా హిందీలో" అన్నారు.

"అప్పుడు నేనేం చీర గట్టుకున్నాను?"

"వెలిసిపోయిన సిల్కుచీర"

"ఛ! ఛ! శుభ్రమైన చీర కట్టుగునుండాలిసింది. రాక రాక ప్రధాని మాయింటికొస్తే, ఈ దిక్కుమాలిన వెలిసిపోయిన చీరతో పొయ్యిముందు తగలడ్డాను కాబోలు."

"ఏవండీ తల దువ్వుకున్నానా?"

"లేదనుకుంటాను. ముడేసుకున్నావు తరవాత తీరిగ్గా దువ్వుకోవచ్చని."

"అయ్యయయ్యయ్యో మొహమున్నా రుద్దుకుని బొట్టెట్టుకున్నానా?"

"పాపం పనిలో వున్నావు. బొట్టుకూడా చెరిగిపోయి పశ్చిమాకాశంలా నుదురంతా ఎర్రెర్రగా అయిపోయింది. మొహం తరవాత తోవుకుందావని బద్ధకించి వుంటావు నీ బద్ధకం నాకు తెలిసిందే కదా."

"అత్తగారెలా వుందీ!"

"మా అమ్మ! పట్టుచీర కట్టుకుని ముడిపెట్టుకుని దోసెలు పోస్తోంది. మా అమ్మ పీటవేసింది. నవ్వుతూ పిలిచి"

"పీట నేను వెయ్యలేదా ఆవిడకి."

"లేదు నువ్వావిడ్ని చూడగానే గాబరా పడిపోయావు. ఆవిడేవిటి మనింటికి రావడమేవిటని."

"అవున్లెండి నేను వెర్రి మొహాన్నే కదా!"

"కాదు ముందు ఇందిరా గాంధీగారు నీ భుజమ్మీదే చెయ్యివేసి చాలా పనిలో వున్నట్లున్నావు సీతా" అంది.

"నిజవండీ నా భుజంమీద చేయివేసిందా! నాపేరెలా తెలుసండీ..."

"నీ వ్యాసాలు చదివుంటుంది."

"పోదురూ, మీది మరీబడాయి. ఆవిడకు తెలుగురాదుగా–"

"ఓసి వెర్రి మొహమా – తెలుగు రాకపోతే ఏమి ఆవిడకు సెక్రటరీ లుంటారు. వాళ్ళు చదివి ముద్దచేసి నూరి మాత్తర్లుచేసి ఆవిడచేత మింగిస్తారు."

"పోన్లెండి మనం ఎంత? మనరాతలెంత? ఆవిడ ఏ చీర కట్టుకుందీ? వెడల్పంచా సన్నంచా"

"ఇంకేచీర కట్టుకుంటుందే ఆవిడ, ఖద్దరు చీర.... మీకుమల్లే టెర్లిన్లూ నైలాను నైలక్సులూ అటువంటి గొప్పవారు కట్టుకోరు."

"దిక్కుమాలిన దాన్ని నేనూ ఖద్దరు చీర కట్టుకుని తగలడాల్సింది ఈ మాసిన సిల్కుచీరలో నా అవతారం చూసి ఆవిడ నవ్వుకుందో ఏమో–"

"మీకూ అలాటి ఆలోచన్లు! ఆవిడెందుకలా అనుకుంటుందీ, పాపం అమ్మాయి పనిలో వుంది కాబోలు అనుకుంటుంది."

"మీరనవసరంగా మాట్లాడకండి. నాక్కోపం వస్తుంది. శుద్ధ ఎడ్డిమడ్డి స్వరూపమని ఆవిడ అనుకోదూ నన్ను చూసి. అన్నట్లు మెళ్ళో ఏమన్నా వేసుకున్నానా లేకదేబెలా యిలానే నిలబడ్డానా?"

"మంగళ సూత్రాలు కూడాలేవు పొద్దున్న తలంటోసుగున్నప్పుడు బాత్రూంలో గూట్లో పెట్టి వుంటావు."

"చెవులకీ ముక్కులకీ వున్నాయి. మంగళసూత్రాలే లేవు. వేసుకోకపోయినా ఫరవాలేదనే ధీమాకొద్దీ అలా పారేసుంటావు."

"ఆవిడ వచ్చినపుడు కట్టుకోడానికి నాకొక మంచి ఖద్దరు చీరైనా లేదు చూశారా?"

"నేకేమి నీ పుట్టిన రోజుకని తెస్తే చింపి దుప్పట్లు కుట్టించావుగా తెలివి!"

"రామ! రామ? ఆవిడ ఎలా వున్నారు?"

"నవ్వుతూ వచ్చిందావిడ. అమ్మ పీటవేసింది కూర్చుంది. నవ్వు దోసెలు పెట్టావు."

"ఎన్ని?"

"రెండే రెండు."

"రెండేనా?"

"అవును, అంతకంటె కూర్చుని తినడానికి ఆవిడకు టైమెక్కడుంటుంది. ఊపిరాడని యుద్ధం ఒకపక్క."

"కాఫీ ఏమన్నా ఇచ్చానా?"

"ఇచ్చావు వెండిగ్లాసులో. ఆవిడ వూదుకుంటూ త్రాగింది."

"పాపం, గ్లాసు వేడెక్కిపోయి వుంటుంది. అందుకేచెబుతున్నాను నాలుగు మంచి కప్పులూ సాసర్లూ తెచ్చిపడేయండీ అని."

"తేలేదా- ఎన్ని తెచ్చినా నువ్వే పగలగొట్టేస్తావ్. నీ చేతులుమహావదులు."

"అనండనండి అన్నిటికీ నేనొక్కర్తిని దొరికాను మీకు. నేనేగా లోకువ."

"ఏడవకు. ఆవిడకి నీవిచ్చిన పలకల వెండిగ్లాసును పవిట చెంగుతో పట్టుకుని వూదుకుంటూ తాగి నీతో నవ్వుతూ కబుర్లుచెప్పి వెళ్లిపోయింది."

"ఇంతకీ నేనావిడకు నమస్కారం అన్నా చేశానా లేదా?"

"లేదు, నీకావిడ్ని చూడగానే కాళ్ళలోంచి దడ వొణుకు బయల్దేరి వుంటాయి."

"ఛీ! పాపిష్టిదాన్ని దేశానికి నాయకురాలు యింటికొస్తే వొణికి తగలడ్డాను కావల్ను, ఆవిడ ఏమనుకుందో, ఏమిటో – "

"ఆవిడ ఏమనుకోలేదు గాని పోలీసులొచ్చారుగా వెంట." "పోలీసు లెందుకూ?"

"ఎందుకేవిటి? ఆవిడకు నువ్వేదో పెట్టావు. అలా నువ్వు పెట్టకూడదు, ఆవిడ తినకూడదు."

"ఎందుచేత?"

"ప్రధాని నీలాటి అడ్డమైన వాళ్ళింటికి వెళ్ళి కాఫీ ఫలారాలు చేస్తే ఇక సెక్యూరిటీ పోలీసులూ, డాక్టర్లూ ఎందుకు? వాళ్ళు నిన్ను అరెస్ట్ చేసినా చెయ్యొచ్చు."

"బావుందండీ. రెండేగా దోసెలు తింట. ఆ మాత్రానికే పోలీసులు రావాలా?"

"ఓసి వెర్రి మొహమా. ప్రధాని దోసెలు తినకూడదు. నువ్వు పెట్టకూడదు. తెలిసిందా? జాగ్రత్త" కొంచెం ఆగి

"ఇంతకి ఆవిడ కల్లోవచ్చింది. నాకుగాని నీకుకాదు."

"పోదురూ మీ బడాయిలు."

"దోసెలు పెడితే పెట్టావుగాని, ఎక్కడా అనకు పోలీసులు నిన్ను భద్రతా చట్టంకింద మోసుకుపోతారు."

"సర్లెండికాని, శుభ్రమైన గాజు గ్లాసులు అరడజను నాలుగుకప్పులు, సాసర్లూ పట్రండి. ఎవళ్ళన్నా పెద్ద వాళ్ళొచ్చినపుడు కంచు చెంబు ల్తోనూ స్టీలు గ్లాసుల్తోనూ కాఫీలిస్తే ఏం బాగుండదు."

"చిత్తం! చిత్తం!"

(ఇది నిజంగా జరిగింది, ఇందలిపాత్రలు. సంభాషణలన్నియు కేవలం కల్పితం కాదు. మా వారి కల్లోకి ఆవిడ ఎందుకు వచ్చిందో ఆ భారతరత్నగారినే అడగండి. దోసెలు తిన్నమాట మాత్రం నిజం. రెండే రెండు)

# అసంపూర్ణ రామాయణం

జ్ఞానం లేకపోవడమే అజ్ఞానం. సముద్రపు లోతు ఎంతో మనకు తెలియదు. అలాగే ఆకాశం ఎంత ఎత్తో కూడా మనకు తెలిసిచావదు. అన్నీ తెలిసిన వారంటూ ఎవరూ వుండరు. అంచేత ఎవరికైనా ఏ విషయంలోనైనా తెలిసిన దాని కంటె తెలియనిదే ఎక్కువ వుంటుంది. మనకు తెలిసినవీ, తెలియనివీ ఏవిటి అనే నిర్ధారణకు ఒక జీవిత కాలం కూడా సరిపోదనుకుంటాను.

భారతం చదివారా?

అయ్యో చదవలేదండీ -

అయ్యో భారతవే చదవలేదా?

ఏం చేస్తాం చదవలేదు. నిజమే - సిగ్గుగా వుంటుంది.

★ ★ ★

మొన్న కచ్చేరీకి వెళ్ళారా?

ఏ కచ్చేరీ?

బాలమురళీకృష్ణ కచ్చేరీ?

బాలమురళీకృష్ణ ఎవరూ?

అయ్యో బాలమురళీకృష్ణే తెలీదా?

నిజం మీ మీదొట్టు....